క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం నరేంద్ర

ఓజిలి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉత్తమ విద్యాబోధన చేస్తున్నారని ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం నరేంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘురామరాజు, సాగునీటి సంఘం అధ్యక్షుడు అశోక్‌రాజు, మాజీ సర్పంచ్ కే ఈశ్వర్‌రాజు, ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, మల్లికార్జున, నరసింహరాజు, చంద్రశేఖర్‌రాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డలను చదువుకు దూరం చేయొద్దు



కోతలగుంట పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిట్టమూరు : తమ బిడ్డలను చదువులకు దూరం చేయొద్దని మండలంలోని ఈశ్వరవాక పంచాయతీ కోతలగుంట గ్రామస్తులు కోరారు. వారు శుక్రవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఎల్లసిరి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో విలీనం చేశారని తెలిపారు. తమ గ్రామం నుంచి అక్కడికి ఏడు కిలోమీటర్ల దూరం ఉందన్నారు. బస్సు, ఆటో సౌకర్యం లేదని వాపోయారు. పిల్లలు కాలి నడకన అంతదూరం ఎలా వెళతారని నిలదీశారు. ప్రయివేటు స్కూళ్లకు పంపించే స్థోమత తమకు లేదన్నారు. అందువల్ల పిల్లలను బడికి కాకుండా పనులకు పంపించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

పీడీకి ఘన సన్మానం



పీడీని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

సైదాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తూ బదిలీ అయిన పైడి కోటేశ్వరరావును శుక్రవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.మోహన్‌రావు, ఉప సర్పంచ్ శివకుమార్, యాదవ సంఘం నేతలు అనీల్‌కుమార్‌యాదవ్, ఆవుల మురళీ యాదవ్, ఆవుల సాంబయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఆర్‌ఎం



గ్యారేజ్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం వెంకటరావు

వాకాడు : స్థానిక ఆర్టీసీ డిపోను శుక్రవారం రీజనల్ మేనేజర్ వెంకటరావు తనిఖీ చేశారు. గ్యారేజ్‌లోని యంత్రాల మరమ్మతులు, స్టోర్‌లోని పరికరాలను పరిశీలించారు. డైలీ బస్సు సర్వీసులు, బస్సులకు ఉపయోగించే ఇంధనం, రికార్డులను తనిఖీ చేశారు. వాకాడు, కోట బస్టాండులో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పనితీరును మెరుగు పరుచుకోవాలని గ్యారేజ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్మికులు డిపోలోని సమస్యలను ఆర్‌ఎం దృష్టికి తీసుకొచ్చారు. డీఎం పెంచలయ్య, ట్రాఫిక్ ఇన్‌చార్జి బ్రహ్మయ్య, మెకానికల్ ఇన్‌చార్జి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

కోట : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కెనరా బ్యాంకు లక్ష్యమని తిరుపతి జనరల్ మేనేజర్ ఐ.పి.మిథంథాయ తెలిపారు. ఆయన శుక్రవారం ఆధునీకరించిన కోట కెనరా బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కస్టమర్ల సౌకర్యం కోసం కోట బ్రాంచ్‌ను ఆధునీకరించినట్లు తెలిపారు. తమ బ్యాంకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.47 కోట్ల నుంచి రూ.60 కోట్ల లావాదేవీలు పెంపే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రామ్మోహన్, బ్రాంచి మేనేజర్ వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

కనిపించని అభివృద్ధి

'పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం మా ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది' అని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సమావేశాల్లో చెబుతున్నారు. దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు పంచాయతీ దిగువమేలుపాక, అయ్యపాళెం గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అధికారులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. తీవ్ర ఇబ్బందుల మధ్య జీవనం సాగిస్తున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సరైన రోడ్డు లేక నానా అగచాట్లు
- అడవిని తలపిస్తున్న దిగువమేలుపాక ఎస్సీ కాలనీ
- వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న దిగువమేలుపాక, అయ్యపాళెం గ్రామస్తులు



దిగువమేలుపాక గ్రామానికి వెళ్లే రోడ్డు



పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్ సమీపంలో బాక్స్‌టైప్ బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు పంచాయతీ దిగువ మేలుపాక, అయ్యపాళెం గ్రామాల్లో సుమారు 200 కుటుంబాలు వున్నాయి. 500 మందికి పైగా జనాభా ఉంది. జాతీయ రహదారికి రెండు కిలోమీటర్లు దూరంలోనే ఈ గ్రామాలు వున్నాయి. వాటికి ఇప్పటికీ సరైన రోడ్డు లేదు. వున్న మట్టి రోడ్డు వర్షాకాలంలో బురదమయం అవుతుండడంతో వారి తిప్పలు అన్నీఇన్నీ కావు. దిగువమేలుపాక గ్రామం, ఎస్సీ కాలనీలు చుట్టూ అటవీ ప్రాంతం వుంది. రాత్రిళ్లు పాముల బెడద అధికంగా ఉంటోంది. కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. దిగువమేలుపాక విద్యార్థుల సౌకర్యార్థం 20 ఏళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి పాఠశాల భవనం నిర్మించారు. పనులు పూర్తి కాకముందే పిల్లలు లేరనే నెపంతో పాఠశాలను ఎత్తివేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జిలో నిలుస్తున్న నీరు

అయ్యపాళెం, దిగువమేలుపాక గ్రామాల సమీపంలోనే పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్, రైల్వే లైను వున్నాయి. గతంలో రైళ్లు వెళ్లేటప్పుడు గంటల తరబడి గేట్లు వేసేవారు. అలాగే పలు ఖాళీ రైళ్లు రోజుల తరబడి నిలిచి వుండేవి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన రైల్వే అధికారులు గేటు తొలగించి ఇటీవల బాక్స్‌టైప్ బ్రిడ్జి నిర్మించారు. వర్షపు నీరు వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

దుస్థితిలో దిగువమేలుపాక చెరువు

దిగువమేలుపాక చెరువు కింద 270 ఎకరాల ఆయకట్టు వుంది. ఈ చెరువు విస్తీర్ణం మూడు వందల ఎకరాలు వుంటుంది. చెరువు పూర్తి స్థాయిలో నిండితే మూడేళ్ల భూగర్భ జలాలకు కొదవ ఉండదని స్థానికులు చెబుతున్నారు. దీని అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడు లేడు. చెరువుకున్న రెండు తూములు దెబ్బతినడంతో నీరు పొలాలకు చేరడం లేదు. కట్ట బలహీనంగా ఉంది. దీన్ని అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.



దిగువమేలుపాక చెరువు తూము దుస్థితిని చూపుతున్న రైతు

రాత్రిళ్లు రోడ్డులో నడవలేము



జాతీయ రహదారి నుంచి దిగువమేలుపాక గ్రామానికి సరైన రోడ్డు లేదు. చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం వుంది. పాములు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. రాత్రిళ్లు ఈ రోడ్డులో నడవాలంటే భయంగా ఉంటుంది. – ధనుంజయ, దిగువమేలుపాక

చెరువు తూములకు మరమ్మతులు చేపట్టాలి



దిగువమేలుపాక చెరువు తూములు దెబ్బతిన్నాయి. చెరువు నిండా నీరున్నా పొలాలకు సక్రమంగా చేరడం లేదు. నీరు వృథా అవుతోంది. తూములకు మరమ్మతులు చేయాలి. అలాగే చెరువు కట్టను పటిష్టం చెయ్యాలి. – పైడి హరికృష్ణ, దిగువమేలుపాక

రోడ్డు వేసి ఆదుకోండి



దిగువమేలుపాకకు రోడ్డు సక్రమంగా లేదు. అత్యవసర సమయాల్లో ఆటోలు, కార్లు కూడా రావడం లేదు. 108 వాహనం అసలే రావడం లేదు. పంటలకు ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. – నాగమ్మ, దిగువమేలుపాక ఎస్సీ కాలనీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ ఎస్.శివశంకర్ తెలిపారు. నాయుడు పేట పట్టణంలోని అగ్రహార పేట, కోళ్లఫారమ్, అవని అపార్టుమెంట్, శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు, హెచ్ పీ పెట్రోలు బంక్, రాజగోపాలపురం, శ్రీరామ్ నగర్, అశోక్ నగర్, జువ్వలపాళెం, విన్నమాల గేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

దక్కిలి : తెలుగు గంగ కాలువలోని నీటి ప్రవాహంలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన దక్కిలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దక్కిలి కమ్మపల్లి రోడ్డు సెంటర్‌కు చెందిన పల్లపు కృష్ణయ్య కుమారుడు శ్రీనివాసులు(25) తన స్నేహితులు మార్లగుంటకు చెందిన వీరభద్రయ్య, ప్రకాశం జిల్లా బొడపాడుకు చెందిన ఇన్నయ్య ముగ్గురు కలిసి గురువారం సాయంత్రం సరదాగా దక్కిలి సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువ వద్దకు చేరుకుని ఈత కొట్టేందుకు బ్రిడ్జి వద్ద దూకారు. కాలువ నిండుగా నీరు ప్రవహిస్తుండడంతో శ్రీనివాసులు గల్లంతయ్యాడు. స్నేహితుడిని కాపాడేందుకు వీరభద్రయ్య ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. యువకుడి మృతదేహం నరసనాయుడుపల్లి వద్ద లభ్యమైంది. దక్కిలి ఇన్‌చార్జి ఎస్‌ఐ కామినేని గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖి బ్యారేజ్‌కి నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : మండల ప్రజలు సాగు, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్‌కి 200 క్యూసెక్కుల గంగ నీటిని విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, చిట్టమూరు, కోట మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రైతులకు ఎడగారు సాగుకు అవసరమైన నీటిని అందించేందుకు అధికారులు సహకరించాలన్నారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా ఆదుకోవాలన్నారు. వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ ఆధారంగా దాదాపు 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నట్టు తెలిపారు. సుమారు 6 వేల తాగునీటి బోర్లు ఉన్నట్టు తెలిపారు. 2023లో ఎగువ ప్రాంతంలోని కల్యాణి డ్యామ్‌లో 15 టీఎంసీల నీరు నిల్వ ఉన్నప్పుడు తాము రాజకీయాలకు అతీతంగా 200 క్యూసెక్కుల నీటిని బ్యారేజ్‌కి విడుదల చేసినట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం కల్యాణి డ్యామ్‌లో 40 టీఎంసీల నీరు నిల్వ ఉన్నప్పటికీ నీటిని విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఎండుతున్న పంటలను కాపాడేందుకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, మల్లాం శేషురెడ్డి, సుధాకర్‌నాయుడు, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి రవి, నెల్లూరు పెంచలరెడ్డి, తూపిలి మధురెడ్డి, శేషారెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిల్లకూరు : మండలంలోని తీపనూరు సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అతనికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని వెల్లడించారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతదేహం చిల్లకూరు మండలం తీపనూరు గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌కు 300 మీటర్ల దూరంలో ఉన్నట్టు గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులకు సమచారం ఇచ్చారు. దీంతో జీఆర్‌పీఎఫ్, చిల్లకూరు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. తమ పరిధికి చెందినది కాదని వెనుదిరిగారు. దీంతో సుమారు ఐదు గంటల పాటు మృతదేహం అక్కడే ఉండి పోయింది. చివరకు పోలీసుల చర్చల అనంతరం చిల్లకూరు పోలీసులు ముందుకు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని త్రిభువని సెంటర్ సమీపంలో వున్న నేదురుమల్లి జనార్దన్ రెడ్డి కాంస్య విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గురువారం ఉదయం ముక్కుకు గాయమై అతను నిద్రిస్తున్నట్లు కార్మికులు తెలిపారని పేర్కొన్నారు. అతను శుక్రవారం మృతి చెందిఉన్నాడని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడు ఎరుపు కలర్ చొక్కా, ఎరుపు రంగు లోదుస్తులు ధరించాడని, తెల్లటి గడ్డం ఉన్నట్లు తెలిపారు. మృతదేహాని వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తల్లికి వందనం వర్తింపజేయాలని నిరసన

వెంకటగిరి(సైదాపురం) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏఐటీయూసీ నాయకుడు జాన్ కోరారు. ఆయన శుక్రవారం కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఔట్ సోర్సింగ్ కార్మికులకు అందడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, నరసింహులు, నరసింహులు, కందప్ప, నరేష్, మునిరాజా, నాగార్జున, నాగేశ్వరరావు, గిద్ద వెంకటేశ్వర్లు, చగల్‌రాయులు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయాల్సిందే

వెంకటగిరి రూరల్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాల్సిందేనని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరింది. నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, రమణయ్య మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు నిబంధనలకు విరుద్ధంగా 10 ఏళ్లుగా వెంకటగిరిలోనే పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆయనను బదిలీ చేయాలని కోరారు. లేనిపక్షంలో దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటగిరి రూరల్ : ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని జీకేపల్లి పీహెచ్‌సీ వైద్యులు లావణ్య తెలిపారు. మండలంలోని జీకేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఉప్పరపల్లి, చెలికంపాడు గ్రామాల్లో శుక్రవారం స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, హరిత, సర్పంచ్ వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు రూప్‌కుమార్, రాజేశ్వరి, సూపర్‌వైజర్ కస్తూరిబాయి, పీహెచ్‌సీ సుబ్బలక్ష్మి, సీహెచ్‌వోలు నాగజ్యోతి, ఆర్ మేఘన, ఎం పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గిరిపుత్ర ఫౌండేషన్ నాయకులు

చిల్లకూరు : గిరిజన యువతలోని ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గిరిపుత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు జయవర్ధన్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో శుక్రవారం పోటీలు ప్రారంభించారు. ఇందులో గూడూరు, నెల్లూరు, కావలి డివిజన్లకు చెందిన 24 జట్లు పాల్గొన్నాయి. ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులను అన్ని విధాలా చైతన్యం చేయడానికి గిరిపుత్ర ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మూడు డివిజన్లలోని గిరిజన కాలనీలకు చెందిన యువకులను ఎంపిక చేసి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ గెలిచిన జట్లు నెల్లూరులో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు మాకాని వెంకటేశ్వర్లు, చిల్లకూరు మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ప్రీ స్కూల్‌లో చేర్పించాలి



అంగన్‌వాడీలకు పుస్తకాలు ఇస్తున్న సునందన

రాపూరు/కలువాయి(సైదాపురం): మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చేరించాలని ఐసీడీఎస్ సీడీపీవో సునందన పిలుపునిచ్చారు. ఆమె శుక్రవారం రాపూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం, రాపూరులో ప్రీ స్కూల్ పిల్లలకు అందజేసేందుకు పీపీ1, 2 పుస్తకాలు పంపిణీ చేశారు. మూడేళ్లు నిండిన పిల్లలకు పీపీ 1 పుస్తకాలు, నాలుగేళ్లు నిండిన పిల్లలకు పీపీ– 2 పుస్తకాల ద్వారా విద్యాబోధన చేస్తామన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప, హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఆర్టీసీ డిపో ద్వారా కడప, హైదరాబాద్‌కు బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరి ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను ఆధునీకరించనున్నట్టు తెలిపారు. వసతి గది, మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

యోగా దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు



నాయుడుపేట టౌన్ : యోగాపై ర్యాలీ చేస్తున్న మేనకూరు హైస్కూల్ విద్యార్థులు, అధికారులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ, రూరల్ మండలంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవోలు మునిరత్నం, శాంతి, వివిధ శాఖల అధికారులు పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. శనివారం మండల పరిధిలో 99 సెంటర్లు, పట్టణంలో 117 సెంటర్లలో యోగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగాంధ్రకు ప్రత్యేక ఏర్పాట్లు

కలువాయి(సైదాపురం): మండలంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు 139 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో భవాని తెలిపారు. వాటికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాపూరులో 150 యోగా కేంద్రాలు

రాపూరు: యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో భాగంగా మండలంలో 150 యోగా సెంటర్లను ఏర్పాటు చేసినట్టు మండల ప్రత్యేక అధికారి సింహాద్రి, ఎంపీడీవో భవాని తెలిపారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సర్పంచ్, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

దొరవారిసత్రం/కోట/చిట్టమూరు/చిల్లకూరు/దక్కిలి/సైదాపురం/నాయుడుపేట టౌన్/వాకాడు/రాపూరు : సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రెవెన్యూ వ్యవస్థ ప్రాధాన్యత, ఈ విభాగంలో అందించే సేవల గురించి అధికారులు అవగాహన కల్పించారు. రైతులకు ఇచ్చే 1బీ, అడంగల్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, డీఫారం పట్టాలు, రికార్డుల నిర్వహణ తదితరాల ప్రాముఖ్యతను రెవెన్యూ సిబ్బందికి వివరించారు. గొలుసు సర్వే, జీపీఏ యంత్రంతో చేసే సర్వేపై అవగాహన కల్పించారు. రెవెన్యూ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంచేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ శాఖలో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించారు. అత్యుత్తమ పనితీరును ప్రదర్శించిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, నివాస ధ్రువీకర ణ పత్రాలు అందజేశారు. కోట, చిట్ట మూరు, చిల్లకూరు, దక్కిలి, సైదాపురం, నాయడుపేట, వాకాడు, రాపూరు తహసీల్దార్లు జయజయరావు, కాయల సతీష్‌కుమార్ శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసులు, సుభద్ర, మాగర్ల రాజేంద్ర, రామయ్య, లక్ష్మీనరసింహ కోట, చిట్టమూరు ఎంపీడీవోలు దిలీప్‌కుమార్, మనోహర్‌గౌడ్, దొరవారిసత్రం ఏఎస్‌వో మోహన్, డీటీలు మల్లికార్జున్, నిరంజన్, లక్ష్మీ, సందీప్, మండల సర్వేయర్లు నాగరాజు, మల్లికార్జున్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు ప్రవీణ్‌రాయల్, పూర్ణ, ప్రదీప్‌కుమార్, అఖిల్, ఎస్‌ఐ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దీవీ సత్రం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



చిల్లకూరు: లబ్ధిదారులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది



దక్కిలి : విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది